




రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టరేట్లలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్

# అర్జీలను పరిశీలించి..పరిష్కారానికి ఆదేశించి..

### ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్ జైన్

ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబర్ 30 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన స్వయంగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రజాపాలన నుంచి జిల్లాకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు వివరించాలన్నారు. కాగా ప్రజావాణికి 78 ఫిర్యాదులు అందాయి.

#### వసతి గృహాలను తనిఖీ చేయాలి..

జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు వారంలో మూడు రోజులపాటు గ్రామాల్లో అందుబాటులో ఉండి స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. వసతి గృహాల్లో నిర్లక్ష్య ధోరణి కనిపించకుండా స్పెషల్ ఆఫీసర్లే కాకుండా జిల్లా సాంఘిక సంక్షేమ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు, జిల్లా విద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. దసరా సెలవుల తర్వాత ఈ కార్యాచరణను చేపట్టాలన్నారు. అక్టోబర్ రెండోవారం తర్వాత స్పెషల్ ఆఫీసర్ల పనితీరుపై అధికారులు రిపోర్టులను అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, డీఆర్‌డీవో శ్రీలత, డీపీవో సురేష్‌మోహన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

#### వికారాబాద్ జిల్లాలో 131 దరఖాస్తులు

వికారాబాద్ : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని సూచించారు. ప్రజావాణికి 131 దరఖాస్తులు రాగా.. అందులో రెవెన్యూ , విద్య, మున్సిపాలిటీ, ఎంప్లాయిమెంట్, అగ్రికల్చర్, పంచాయతీరాజ్, లీడ్ బ్యాంకు, ఏడీ లాండ్ అండ్ సర్వే నుంచి ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

#### ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పదు..

ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పదని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఉద్యోగవిరమణ పొందిన జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రరావుకు కలెక్టర్ శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలను రోడ్డుపాలు చేయొద్దు

### బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30 : ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లు కూల్చి బజారున పడేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో ప్రభుత్వం రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నదన్నారు. కొన్నేండుగా స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదల ఇండ్లను కూల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. హైడ్రా హైదరాబాద్‌కే పరిమితమని చెబుతున్న అధికారులు అత్యుత్సాహంతో రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం పెద్దచెరువును ఎందుకు పరిశీలించారని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం చెరువు పరిసర ప్రాంతాల్లో అనేక మంది నిరుపేదలు ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని.. నాలుగేండ్ల కిందట ఇబ్రహీంపట్నం చెరువు అలుగు పారినప్పుడు కూడా వారి ఇండ్ల వద్దకు నీరు రాలేదని, అలాంటి వడ్డెరబస్తీని కూల్చివేస్తామని భయపెట్టొదని హెచ్చరించారు. పేదల ఇండ్లను కూల్చుతామంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

### నేవీ రాడార్ స్టేషన్ నిర్మిస్తే

# మనుగడకు ముప్పే

### బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్



సినీనటుడు సోనుసూద్‌ను కలిసిన రాజేందర్‌గౌడ్

వికారాబాద్, సెప్టెంబర్ 30 : దామగుండం అటవీ సమస్య భారత జాతీయ సమస్య అని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రముఖ సినీనటుడు సోనుసూద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. దామగుండం అడవి పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాన్ని అతడికి వివరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ నేవీ రాడార్ స్టేషన్‌ను నిర్మిస్తే 12 లక్షల చెట్లు తొలగింపబడతాయని, అదే విధంగా అడవి జంతువులు, వివిధ రకాల పక్షుల మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. త్వరలోనే వాతావరణ పరిశోధన మేధావులు, సైంటిస్టులతో భేటీ అయి దామగుండం గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. సోనుసూద్‌ను కలిసిన వారిలో సునంద, రామన్న, వెంకటయ్య, గీత, మహేందర్ , చైతన్య, కిరణ్ తదితరులున్నారు.





మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

# పార్కు చేసిన బైకుల చోరీ

- ఐదుగురు నిందితుల అరెస్టు, రూ.9 లక్షల విలువ గల మోటర్ సైకిళ్ల రికవరీ
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

యాచారం, సెప్టెంబర్ 30 : తీగలాగితే డొంక కదిలింది. పోలీసులు వాహనాల తనిఖీల్లో నంబర్ ప్లేటు లేని ఓ బైకును గుర్తించి.. దానిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి 23 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బైకులను తస్కరిస్తున్న వ్యక్తితోపాటు వాటిని విక్రయిస్తున్న మరో నలుగురిని అరెస్టు చేసి.. వారి నుంచి రూ. తొమ్మిది లక్షల విలువ గల 23 బైకులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం యాచారం ఠాణాలో జరిగిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఠాణా పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేటులేని ఓ స్ప్లెండర్ ప్లస్ బైకును గుర్తించారు. సీఐ నరసింహారావు, ఎస్ఐ తేజంరెడ్డి విచారించగా అది చోరీ చేసిన బైకుగా తేలింది. దీంతో మండలంలో ఇటీవల దొంగతనానికి గురైన బైకులపై వారు ముమ్మరంగా దర్యాప్తు చేయగా.. తలకొండపల్లి మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన దుబ్బ హర్షవర్ధన్‌ను నిందితుడిగా గుర్తించారు. హర్షవర్ధన్ ఐటీఐ వరకు చదివి జల్సాలకు అలవాటు పడి.. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలు మొదలెట్టాడు. హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్, మహబూబ్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, యాచారం, మంచాల, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఠాణాల పరిధుల్లోని బస్టాండ్లు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో పార్కు చేసిన బైకులను మాస్టర్ కీ ద్వారా చోరీ చేసి.. వాటిని తనకు పరిచయం ఉన్న మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన జాల నాగరాజు, బేత జంగయ్య, నందివనపర్తి గ్రామానికి చెందిన ఎడ్ల రాజు, మహ్మద్ అమీర్ అలీలకు ఇచ్చేవాడు. వారు వాటిని గ్రామాల్లో తక్కువ ధరకు ప్రజలకు విక్రయించేవారు. వాహన తనిఖీల్లో పోలీసులకు నంబర్ ప్లేటు లేని ఒక్క బైకు దొరగ్గా.. వారు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి.. 23 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో అఫ్జల్‌గంజ్ ఠాణా పరిధిలో–4, ఎంజీబీఎస్ ఏరియాలో–3, మహబూబ్‌నగర్ ఠాణా పరిధిలో–1, ఆదిబట్ల ఠాణా పరిధిలో–3, యాచారం ఠాణా పరిధిలో–4, ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో–4, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఠాణా పరిధిలో– 1, మంచాల ఠాణా పరిధిలో–3 బైకులను అతడు తస్కరించాడు. ఈ బైక్‌లకు సంబంధించి ఆయా ఠాణాల పరిధుల్లో ఇప్పటికే కేసులు నమోదై ఉన్నందున వాటిని ఒరిజినల్ పత్రాలతో గుర్తించి యాజమానులకు కోర్టు ద్వారా అందజేస్తామని డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు. 23 మోటర్ సైకిళ్లను తక్కువ సమయంలో రికవరీ చేసిన ఎస్ఐ తేజంరెడ్డి, సిబ్బంది శ్రీను, సుందర్, హాతీరామ్, నరేందర్‌లను అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ, ఆదిబట్ల, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల సీఐలు నరసింహారావు, రాఘవేందర్‌రెడ్డి, శంకర్‌కుమార్, ఆర్.బీ నాయక్, సత్యనారాయణ, జగదీశ్, యాచారం ఎస్ఐలు మధు, సత్యనారాయణ, ఫైసల్ అహ్మద్ తదితరులున్నారు.

# సత్తా చాటారు..

### డీఎస్సీ ఫలితాలు రిలీజ్



నరేశ్, రాఘవేందర్, వేణుగోపాల్

బొంరాస్‌పేట/వికారాబాద్, సెప్టెంబర్ 30: టీచర్ పోస్టుల భర్తీ కోసం గత జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. దుద్యాల మండలంలోని లగచెర్ల గ్రామానికి చెందిన కావలి రమేశ్ బయో సైన్స్(ఎస్.ఏ) విభాగంలో 78.27 మార్కులు సాధించి జిల్లాలో రెండో ర్యాంకు, అదే గ్రామానికి చెందిన విద్యావతి ఎస్జీటీ విభాగంలో జిల్లాలో 47వ ర్యాంకు సాధించింది.

#### నాందార్‌పూర్‌లో నలుగురికి ర్యాంకులు

మండలంలోని నాందార్‌పూర్ గ్రామంలో నలుగురు అభ్యర్థులు డీఎస్సీ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించి ఉద్యోగాలకు అర్హత సాధించారు. తట్టి పెద్ద వెంకటయ్య భాషా పండిత్ విభాగంలో 78.47 మార్కులు సాధించి జిల్లాలో రెండోర్యాంకు, కుంభళ్ల నరేశ్(ఎస్జీటీ)లో 75.80 మార్కులతో 32 ర్యాంకు, కుంభళ్ల రాఘవేందర్ (ఎస్జీటీ) 78.53 మార్కులతో 16వ ర్యాంకు, మంగలి వేణుగోపాల్ (ఎస్జీటీ) 74.67 మార్కులతో 49వ ర్యాంకు సాధించాడు. నరేశ్, రాఘవేందర్ ఇద్దరు అన్నదమ్ములు.. ఒకే గ్రామంలో నలుగురు యువకులు టీచర్ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. కాగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసి వారికి ఈ మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించామని డీఈవో రేణుకాదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు అక్టోబర్ 1 నుంచి 5 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

–అన్ని మాధ్యమాల ఎస్జీటీలు వికారాబాద్ డైట్ కాలేజీకి వెళ్లాలి.

–అన్ని సబ్జెక్టులు, అన్ని మాధ్యమాల స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, పీఈటీలు శివారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకెళ్లాలి.



బండపల్లి శివారులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన స్థలం.. జేసీబీని పరిశీలిస్తున్న ఆర్ఐ సైమన్

# అక్రమంగా మట్టి తవ్వకాలు..

### టిప్పర్ సీజ్... జేసీబీ పరార్

పెద్దేముల్, సెప్టెంబర్ 30 : అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కిషన్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని బండపల్లి గ్రామ శివారులో కొంతమంది అనుమతుల్లేకుండా జేసీబీ, టిప్పర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆయన..వెంటనే ఆర్ఐ రిచర్డ్స్ సైమన్, జూనియర్ అసిస్టెంట్ రమేశ్ ను అక్కడకు పంపించారు. మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, టిప్పర్లకు ఎలాంటి అనుమతుల్లేకపోవడంతో టిప్పర్‌ను సీజ్ చేయగా.. జేసీబీ అక్కడి నుం చి వెళ్లిపోయిందని చెప్పడం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయానికి జేసీబీ, టిప్పర్లను తరలిస్తున్న క్రమంలో జేసీబీ డ్రైవర్ జేసీబీతో పరారైనట్లు ఆర్ఐ రిచర్డ్స్ సైమన్ తెలిపారు.



పత్తి, కంది, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

# రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

యాలాల, సెప్టెంబర్ 30 : వరిలో కాండం తొలిచే, ఆకు ముడత పురుగుల నివారణలో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం, వరి పరిశోధనా స్థానం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. సోమవారం శాస్త్రవేత్తలు రాంగోపాల్‌వర్మ, చంద్రమోహన్, కిరణ్‌బాబు, తాండూరు ఏరువాక కో–ఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్తలు యమున, ఏడీఏ రుద్రమూర్తి, మండల వ్యవసాయాధికారి సూర్యప్రకాశ్ సంయుక్తంగా యాలాల్, బషీరాబాద్ మండలాల్లో పత్తి, కంది, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పొటాష్ లోపాన్ని సవరించుకోవడానికి చిరు పొట్ట దశలో పొటాష్ ఎరువును వాడాలన్నారు. పత్తి పంటలో వచ్చే పచ్చదోమ, వడలు తెగులు నివారణ చర్యలను రైతులకు వివరించారు.

## అవసరం మేరకే వనరులను వాడుకోవాలి

చేవెళ్ల రూరల్ : అవసరం మేరకే వనరులను వాడుకోవాలని రంగారెడ్డి జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. నేషనల్ గ్రీన్ కాప్స్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం శంకర్‌పల్లిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో సుస్థిర అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. వనరులు పరిమితంగా ఉన్నాయని, వాటిని అవసరం మేరకే వాడుకోవాలన్నారు. ఉన్న వనరులను జాగ్రత్తగా, సమర్థవంతంగా వినియోగించుకోవడమే సుస్థిరాభివృద్ధి అని అన్నారు. వనరుల అన్వేషణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని ఒక్కో ప్రభుత్వ పాఠశాల నుంచి ఒక సైన్స్ టీచర్, ప్రతి పాఠశాలకు ముగ్గురు చొప్పున విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. వారికి ఎల్ఈడీ బల్బుల తయారీ విధానాన్ని సూచించి.. వారితో తయారు చేయించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, రఘునందన్‌రెడ్డి, శేఖర్, రమేశ్, సాయి పాల్గొన్నారు.

### గర్భిణులు, బాలింతలకు

# మెరుగైన వైద్యం అందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్

### వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబర్ 30 : గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం అందించాలని వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ వైద్యులకు సూచించారు. సోమవారం వికారాబాద్ డీఎంహెచ్‌వోలో ఏప్రిల్ నుంచి జిల్లాలో జరిగిన ఐదు మాతృ మరణాలపై ఎంసీహెచ్‌వో ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ పవిత్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సేవలు, అజాగ్రత్తతో గర్భవతులు, బాలింతలకు ఇబ్బంది ఉండొద్దన్నారు. ప్రమాదకర లక్షణాలున్న గర్భవతులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగు చికిత్సలు అందించి నార్మల్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భవతులు, బాలింతలు, పుట్టిన ప్రతి బిడ్డా ఆరోగ్యానికి భరోసానిచ్చేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రయాదవ్, డెమో మీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాసులు, సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.



వికారాబాద్ పట్టణ ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న మల్టీ జోన్– 2 ఐజీపీ సత్యనారాయణ

# రికార్డులు, ఫైళ్ల పరిశీలన

### వికారాబాద్ పట్టణ ఠాణాను సందర్శించిన మల్టీజోన్–2 ఐజీపీ

వికారాబాద్, సెప్టెంబర్ 30 : ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా, జూదం, గుట్కాలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మల్టీజోన్–2, ఐజీపీ సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం ఆయన వికారాబాద్ పట్టణ ఠాణాను సందర్శించి.. నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికా రులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు మెచ్చేలా.. ప్రజలకు నచ్చేలా పని చేయాలని సూచించారు. ఠాణాలకొచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలన్నారు. మర్పల్లి ఠాణా పరిధిలో ఇంతకుముందు పేకాట కేసుల్లో నేరస్తులైన రఫీయుద్దీన్, ప్రభాకర్‌గుప్తాలకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఐజీపీ కౌన్సెలింగ్ చేశారు. ఐజీపీతో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారులు ఉన్నారు.

# తాండూరులో కోల్డ్ స్టోరేజీని నిర్మిస్తాం



ఎల్మకన్నె పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

### తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల/తాండూరు రూరల్, సెప్టెంబర్ 30 : కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని, రూ.2 లక్షల్లోపు రైతుల పంట రుణాలను మాఫీ చేసి తీరుతామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కార్యాలయాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ..తాను గతంలో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న సమయంలో మండలంలోని దౌలాపూర్‌లో నిర్మించిన గోడౌన్‌తోపాటు అన్ని సొసైటీలకు రూ. పది పైసల వడ్డీతో రుణాలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. అన్ని పీఏసీఎస్‌లకు గోదాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేశానని.. ఆ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అదేవిధంగా ఉల్లి రైతుల కోసం తాండూరులో కోల్డ్ స్టోరేజీని (గోదాం) ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎల్మకన్నె డీసీసీబీ వైస్ చైర్మన్, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. నియోజక వర్గంలోని అన్ని మండలాలకు రోడ్డు సౌకర్యంతోపాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా త్వరలోనే ఇస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, సీఈవో శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పురుషోత్తమరావు, మాజీ ఎంపీపీ బాలేశ్వరగుప్తా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాములు, అమృతప్ప, అక్బర్‌బాబా, స్వరూప, నాగప్ప, రాందాస్, శరుణుబసప్ప, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూలో కల్తీపై విచారణ జరిపించాలి

పరిగి, సెప్టెంబర్ 30 : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీకి సంబంధించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేశారు. సోమవారం పరిగిలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి మెమోరాండం అందజేశారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి వాస్తవాలను బహిర్గతం చేయాలన్నారు. టీటీడీ పాలకవర్గంలో హిందూ సమాజానికి చెందిన వ్యక్తులనే కమిటీ సభ్యులుగా నియ మించాలన్నారు. అన్ని ఆలయాల స్థిర, చరాస్థులు పరిరక్షించాలని కోరారు. కా ర్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షు డు రమేశ్, వివిధ పార్టీల నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కృష్ణ, నర్సింహ, రాజు, రాంచందర్, హన్మంతు, ఆనంద్‌గౌడ్, రామస్వామి పాల్గొన్నారు.



# డిజిటల్ సర్వేతో ఇబ్బందులు..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాఫ్ సర్వేతో ఇబ్బంది పడుతున్నామని ఏఈవోలు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తోపాటు వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డికి సోమవారం వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా గతంలో నిర్వహించిన మాదిరిగానే సాధారణ సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డిజిటల్ సర్వే ఒక్క ఏఈవోతో సాధ్యం కాదని క్షేత్రస్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలన్నారు. **-కొడంగల్, సెప్టెంబర్ 30**





# 'దేవుడా ఓ మంచి దేవుడా..

'దేవుడా.. ఓ మంచి దేవుడా.., భగవంతుడా..జర ఆర్టీసీ బస్సుల్లో పురుష ప్రయాణికులు వచ్చేలా చూడు, నీకు రెండు కొబ్బరికాయలు కొడతా' అంటూ ఓ ఆర్టీసీ ఉద్యోగి తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్న ఫొటో, కొటేషన్ అందరినీ ఆకట్టుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. పురుషుల కంటే మహిళలే అధికంగా ప్రయాణిస్తున్నారు. మరోవైపు కండక్టర్లకు డిపో అధికారులు టార్గెట్లు నిర్దేశిస్తుండడం.. బస్సుల్లో మహిళలే అధికంగా వెళ్తుండడంతో వారు సూచించిన లక్ష్యాన్ని రుకోలేక పోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో పురుష ప్రయాణికులు వచ్చేలా చూడని వేడుకుంటూ ఓ ఆర్టీసీ ఉద్యోగి పెట్టిన వాట్సాప్ స్టేటస్ కండక్టర్ల బాధలకు అద్దం పడుతున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**-పరిగి, సెప్టెంబర్ 30**